ప్రజాశక్తి
గురువారం 29 డిసెంబర్ 2022
శ్రీ సత్యసాయి




## జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలకు కదిరి విద్యార్థులు

**ప్రజాశక్తి-కదిరి టౌన్**

స్వ్యా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జమ్మూ కాశ్మీర్లో జరుగుతున్న జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలకు కదిరి విద్యార్థులు ఎంపికయ్యారు. వీరు డిసెంబర్ 30 నుండి జనవరి 2 వ తేదీ వరకు జమ్మూ లో జరుగు స్వ్యా మార్షల్ ఆర్ట్స్ జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాస్టర్ షాకిర్ తెలిపారు. జైన్ స్కూల్ విద్యార్థులు అలైహి వసల్లం, నిహిత, నితిక, మనోజ్ఞ సాయితో పాటు శ్రీ శాంతినికేతన్ స్కూల్ విద్యార్థులు మహమ్మద్ కైఫ్,రీదా ముస్కాన్,నారాయణ స్కూల్ విద్యార్థిని రిషిత, ఎంపియుపి రాణిపేట స్కూల్ నుండి రోష్ని, నలంద కాలేజీ అనంతపురం విద్యార్థి రంజిత్, డిగ్రీ చదువుతున్న విద్యార్థిని చాందిని జాతీయ పోటీలకు ఎంపికయ్యారని మాస్టర్ షాకీర్ తెలిపారు.

# కార్మిక చట్టాలు.. పెట్టుబడిదారులకు తాకట్టు..!





హిందూపురం అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రసంగిస్తున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో కార్మికులకు నష్టం
- ధరల పెరుగుదలకు అనుగుణంగా వేతన చట్టం చేయాలి
- మార్చిలో చలో విజయవాడ, ఏప్రిల్ 5న చలో ఢిల్లీ
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్
- హిందూపురంలో కార్మిక చైతన్య యాత్ర ప్రారంభం

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, తాడిపత్రి, బుక్కరాయసముద్రం, హిందూపురం, పెనుకొండ**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను విదేశీ కంపెనీలు, పెట్టుబడిదారులకు తాకట్టుపెట్టి కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ విమర్శించారు. ఈ ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు రాబోయే రోజుల్లో కార్మిక పోరాటాలను మరింత ఉధృతం చేయనున్నట్టు తెలియజేశారు. భీమవరంలో జరిగే సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణం అంబేద్కర్ సర్కిల్ నుంచి కార్మిక చైతన్యయాత్ర గురువారం ప్రారంభం అయ్యింది. యాత్రను సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు ఆర్వి.నరసింహారావు, స్వరూపరాణి, జి.ఓబులు, నూర్మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వందలాది మంది కార్మికులు హిందూపురం పట్టణం సూగూరు ఆంజనేయస్వామి ఆలయం నుంచి పట్టణ పురవీధుల్లో అంబేద్కర్ సర్కిల్ వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్లో జరిగిన బహిరంగ సభలో నాయకులు ప్రసంగించారు. మొదటి రోజు హిందూపురం నుంచి ప్రారంభమైన 'కార్మిక చైతన్యయాత్ర' పెనుకొండ, అనంతపురం, బుక్కరాయసముద్రం, తాడిపత్రి మీదుగా రాత్రికి కడపజిల్లా ప్రొద్దుటూరుకు చేరింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో గఫూర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని విమర్శించారు. కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయడం లేదన్నారు. ప్రాణాలను ఫణంగా పెట్టి సాధించుకున్న 45 కార్మిక చట్టాలను కాలరాసి నాలుగు లేబర్కోడ్లుగా తీసుకురావడంలో ప్రభుత్వాల కుట్ర దాగుందన్నారు. ప్రస్తుతం దేశం, రాష్ట్రంలో బ్రిటిష్ పాలన కన్నా హీనంగా ఉందన్నారు. రెండు ప్రభుత్వాలూ కార్మికుల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నాయన్నారు. ఆంధ్రుల హక్కుగా ఉన్న విశాఖ ఉక్కును బిజెపి ప్రభుత్వం విదేశీ పెట్టుబడిదారులకు అమ్మడానికి సిద్ధం ఉందన్నారు. కేంద్రం తరహాలో రాష్ట్రం గంగవరం, కృష్ణపట్నం పోర్టులతో పాటు రూ.25 వేలకోట్ల విద్యుత్ జెన్కోను ఆదానీకి అప్పగించడానికి రాష్ట్ర క్యాబినెట్ తీర్మానించిందన్నారు. ప్రభుత్వ భూములను అప్పనంగా ఆదానీకి ఇచ్చేసి ఆంధ్రప్రదేశ్ను ఆదానీప్రదేశ్గా మార్చేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఇలాంటి చర్యలను ప్రతి ఒక్కరూ ప్రతఘటించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి ఎన్నికల ముందు చెప్పిన విధంగా కార్మికులకు కనీస వేతన చట్టం, బోనస్, పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ తదితర సదుపాయాలన్నింటినీ వెంటనే వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అవుట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. హిందూపురం, అటు చిత్తూరు జిల్లాల్లో పది కిలోమీటర్ల అవతులున్న కర్నాటక, తమిళనాడులో గార్మెంట్ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు నెలకు వేతనం రూ.13,500 నుంచి రూ.14000 వరకు ఇస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్లోనున్న పరిశ్రమల్లో ఆరువేలకు మించి ఇవ్వడం లేదన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో సిఐటియు కనీస వేతనాలపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. దీనిపై ఇప్పటి వరకు కనీస వేతన సలహా కమిటీని ఏర్పాటు చేయలేదని విచారం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మార్చి నెలలో చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీ కార్యాక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాలకు కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సిఐటియు ఉపాధ్యక్షురాలు స్వరూపరాణి మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ మూసివేసి అనేక మంది కార్మికులను వీధులపాలు జేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నారన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటుపరం చేసేందుకు పూనుకుంటే అక్కడి కార్మికులకు ఏడాదిగా పోరాటాలు సాగిస్తూ కాపాడుకుంటూ వస్తున్నారన్నారు. ఒకవైపు నిరుద్యోగం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలన్నింటిపై జవనరి 2వ తేదీ నుంచి భీమవరంలో జరగే సిఐటియు రాష్ట్ర మహాసభల్లో పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జెడ్.శ్రీనివాసులు, ఈఎస్.వెంకటేష్, అనంతపురం సిఐటియు జిల్లా అధ్యక్షులు నాగమణి, ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, శ్రామిక మహిళ జిల్లా కార్యదర్శి దిల్షాద్, జిల్లా నాయకులు రమేష్, అనంతపురం జిల్లా నాయకులు గోపాల్, వెంకటనారాయణ, ఎపి మున్సిపల్ వర్కర్సు అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, సత్యసాయి జిల్లా సిఐటియు నాయకులు లక్ష్మీనారాయణ, బాబావలి, బావమ్మతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సిఐటియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సిఐటియు రాష్ట్ర కమిటీకి రూ.లక్ష చెక్కును అందజేసిన శ్రీరామిరెడ్డి, సత్యసాయి కార్మికులు

సిఐటియు రాష్ట్ర కమిటీకి లక్ష రూపాయల చెక్కును జిల్లాలోని శ్రీరామిరెడ్డి, సత్యసాయి వాటర్ వర్కర్స్ యూనియన్ తరుపున ఆ సంఘం నాయకులు అందజేశారు. యాత్ర సందర్భంగా అనంతపురం నగరంలోని నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద జరిగిన సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ వాటర్ వర్కర్స్ ఈ రకంగా రాష్ట్ర కమిటీ ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ముందుకురావడం అభినందనీయం, ఆదర్శనీయమన్నారు. ఇది సిఐటియు ఆధ్వర్యంలో జరిగే ఉద్యమాలకు మరింత దోహదం చేసేందుకు తోడ్పాటును అందించినట్టు అవుతుందని తెలిపారు.



హిందూపురం సభలో పాల్గొన్న సిఐటియు నాయకులు, కార్మికులు



పెనుకొండలో జాతాకు బైక్లతో స్వాగతం పలుకుతున్న సిఐటియు నాయకులు



# సాకారమవని.. సొంతింటి కల..!

- తొమ్మిది శాతంలోపే పూర్తి
- అనువుగాని చోట స్థలాలు



అసంపూర్తిగా జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

పేదవాడికి సొంతింటి కల సాకరం అయ్యేదెప్పుడున్నది ప్రశ్నార్థకంగానే మారింది. నిలువ నీడలేని నిరుపేద ఉండకూడదని వైసిపి ఎన్నికల ముందు హామీనిచ్చింది. అధికారంలోకి వచ్చాక పెద్దఎత్తున ఇళ్లు ఇస్తున్నట్టు హడావుడి నడిచింది. అయితే అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు అవుతున్నా ఇళ్ల నిర్మాణాలు అనుకున్నంత వేగంగా ముందుకు సాగలేదు. పెరిగిన ధరలు, అనువుగాని చోట స్థలాల కేటాయింపులు, బిల్లుల మంజూరులో జాప్యం తదితర సమస్యలతో ఇళ్ల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

**అనువుగాని చోట స్థలాలు**

ప్రభుత్వం పేదలందరికీ ఇళ్ల స్థలమివ్వాలన్న ఉద్దేశంతో భూములను సేకరించి సెంటు చొప్పున లే అవుట్ వేసి ఇచ్చింది. ఈ లే అవుట్లలో కొన్ని పూర్తిగా అనువుగాని చోట ఉన్నాయి. ప్రధానంగా అనంతపురం రూరల్ పరిధిలోని కామారుపల్లి గ్రామం పరిధిలో 6000 మంది లబ్ధిదారులకు లేఅవుట్ వేసి ఇంటి పట్టాలలిచ్చారు. తీరా అక్కడ ఇళ్లు కట్టేందుకు వెళ్లిన సమయంలో సాయిల్ టెస్టు చేస్తే ఇది ఏ మాత్రం నిర్మాణానికి అనువు కాదని నిపుణులు తేల్చారు. దీంతో ఈ స్థలాన్ని ఇటీవల రద్దు చేశారు. అంటే ఇక్కడ పట్టాలు పొందిన వారందరికీ ఇప్పుడు రద్దయ్యాయి. ఇప్పుడు ప్రత్యామ్నాయం కోసం అన్వేషణ మొదలు పెట్టారు. మైనార్టీ కాలనీ, సిద్ధరాంపురం, ఉప్పరపల్లి ప్రాంతాల్లో అధికారులు స్థలాలను పరిశీలించారు. ఇందులో మైనార్టీ కాలనీ ప్రాంతంలోనూ అంతగా అనువుగా లేనట్టు తెలుస్తోంది. ఇక ఉరవకొండలోనూ శ్మశానాలకు పక్కనే లేఅవుట్ ఉండటంతో అక్కడికెళ్లి ఇళ్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారులు వెనుకడుగు వేస్తున్నారు. అంలేకాకుండా కొన్ని లేఅవుట్లు లబ్ధిదారులు ఇప్పుడు ఉంటున్న ప్రాంతానికి చాలా దూరంగా ఉండడంతో అక్కడికి వెళ్లడానికి వారు సముఖత వ్యక్తం చేయడం లేదు.

**తొమ్మిది శాతం లోపే**

అనంతపురం జిల్లా పరిధిలో మొత్తం 19 మండలాల పరిధిలో 68,288 ఇళ్లు మంజూరయ్యాయి. తక్కిన 12 మండలాల్లో ఇళు మంజూరవలేదు. అయిన ఈ ఇళ్లలో ఇప్పటి వరకు కేవలం 6287 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. అంటే తొమ్మిది శాతం ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. 25,991 ఇళ్లు ఇంకా పునాదులు ప్రారంభించి ఉన్నాయి. ఇవి కూడా పునాది వేసుకోకపోతే ఇంటి స్థలం రద్దు చేస్తామని చెబుతుండటంతో కొంత మంది ప్రారంభించారు. మొత్తం ఇళ్లలో 38 శాతం ఇళ్లు ఇంంకా పునాది దశలోనే ఉన్నాయి. 17,230 పునాది దశలో ఉన్నాయి. 2878 లెంటల్ లెవల్, 4980 రూఫ్ దశలో ఉన్నాయి. మరో 10,922 ఇళ్లు ప్రారంభమే అవలేదు.

**ప్రభుత్వం కడుతున్నావీ నత్తనడకే ...**

లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోలేని పరిస్థితిలో ఉంటే వారికి ప్రభుత్వమే కట్టించి ఇస్తుందని ఆప్షన్ త్రీని ఇచ్చింది. ఈ విధంగా ఇచ్చి ప్రభుత్వం కడుతున్న ఇళ్ల నిర్మాణాలు కూడా అనుకున్నంత వేగంగా ముందుకు సాగడం లేదు. ప్రధానంగా అనంతపురం నగరం పరిధిలో మొత్తం 19,298 ఇళ్లు మంజూరు చేసింది. వీటిల్లో కామారుపల్లిలో ఆరు వేల ఇళ్లు పోనూ తక్కిన 13 వేల ఇళ్లను ప్రభుత్వమే ఆప్షన్ త్రీ కింద కట్టించి ఇస్తామని ప్రకటించింది. ఇందులో ఇప్పటి వరకు పూర్తయ్యింది కేవలం 287 మాత్రమే. తక్కిన ఇళ్లలోనూ ఆలమూరు లే అవుట్ పరిధిలో 6900 ఇళ్లకుగానూ 500 ఇళ్లు ప్రారంభమై రూఫ్ లెవల్ చేరాయి. తక్కినవి ప్రారంభమే అవలేదు. ఇక్కడ ప్రభుత్వమే కట్టిస్తునప్పటికీ అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. కాంట్రాక్టర్లు, కార్మికులు, అదే విధంగా ఇంటి సామగ్రి సమస్య తీవ్రంగా ఉంటోంది. ఒక ఇంటికి 1500 ఇటుకలు కావాలి. ఈ లెక్కన ఆరు వేల ఇళ్లకు 90 లక్షల ఇటుకలు అవసరమవుతాయి. ప్రస్తుతం రోజుకు 25వేల వరకు మాత్రమే ఇటుకలు తయారీ అవుతున్నాయి. ఇది కూడా ఒక ప్రధాన సమస్యగా ఉంది. ఇలా అనేక సమస్యలు ఇళ్ల నిర్మాణంలో ఇబ్బందులు ఎదురవుతుండటం గమనార్హం.

# సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గం

- ఇళ్ల పట్టాలు, గృహాల కోసం కలిసికట్టుగా కదులుదాం
- 2వ రోజు పేదల పాదయాత్రలో నాయకులు
- పాదయాత్రకు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మద్దతు





సిపిఎం పాదయాత్రకు మద్దతు తెలిపి పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవాలంటే పోరాటాలొక్కటే మార్గమని సిపిఎం ఆధ్వర్యంలో జరుగుతున్న 'పేదల పాదయాత్ర'లో నాయకులు పేర్కొన్నారు. ఇళ్లు, ఇంటి స్థలాల సమస్య పరిష్కారం కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర రెండోరోజూ పూర్తయ్యింది. బుధవారం ఉదయం పామిడిలో ప్రారంభమైన ఈ యాత్ర కల్లూరు, గార్లదిన్నె, కొత్తపల్లి మీదుగా రాత్రికి సోముదలదొడ్డికి చేరుకుంది. గురువారం ఉదయం అక్కడి నుంచి ప్రారంభమై జిల్లా కలెక్టర్ కార్యాలయం చేరుకోనుంది. అక్కడ నిరసన చేపట్టనున్నారు. రెండో రోజు పాదయాత్రలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరిస్తుంటాయని విమర్శించారు. వైసిపి కూడా అదే రకంగా పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీనిచ్చిందని గుర్తు చేశారు. అయితే ఆచరణలో అందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వలేదన్నది ఈ యాత్ర చూస్తే స్పష్టమవుతుందని వివరించారు. ఇళ్లు అన్నది సామాన్యుడి హక్కు అని పేర్కొన్నారు. ఈ హక్కును పోరాడి సాధించుకోవాల్సిన అవసరముందని సూచించారు. మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా మాట్లాడుతూ భూ సమస్యలపై పోరాటాలు చేసిన చరిత్ర గతంలోనూ ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు నాయకులకు ఉందని చెప్పారు. ఇప్పుడు ఇంత పెద్దఎత్తున ఇళ్ల సమస్యపై పేదలందరూ కలిసి పోరాటానికి సిద్ధపడటం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ప్రభుత్వం చెబుతున్న మాటలకు ఆచరణకు పొంతన ఉండటం లేదని విమర్శించారు. పేదలకు సెంటు స్థలమివ్వడానికి ముందుకురాని ప్రభుత్వం వైసిపి నాయకులు పెద్దఎత్తున వందల ఎకరాలు ఆక్రమించినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎప్పటికైనా పోరాటాల ద్వారానే పేదలు వారి డిమాండ్లను సాధించుకోగలరని పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ మూడున్నరేళ్లలో ప్రభుత్వం నిర్మించిన ఇళ్లు కేవలం ఆరు వేలలోపే ఉన్నాయని చెప్పారు. మొత్తం మంజూరు చేసినవి 68 వేల ఇళ్లు అని తెలిపారు. పది శాతం కూడా పూర్తి చేయకుంటే, మిగిలిన ఈ ఒకటిన్నర సంవత్సరంలోపుఉ ఎన్ని ఇళ్లు పూర్తి చేయగలరో చెప్పాలని ప్రశ్నించారు. పేదలకు ఇంటి స్థలమిస్తున్నట్టు చెప్పి పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలు కొన్ని ఏ మాత్రం అనువుగాని విధంగా ఉన్నాయన్నారు. ఉరవకొండలో శ్మశానం పక్కన ఇంటి స్థలం సేకరించి ఇచ్చారన్నారు. ఈ భూముల కొనుగోల్లోనూ పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని చెప్పారు. పామిడిలో కొండనే కొంత మంది అధికారపార్టీ నాయకులు ఆక్రమించి మట్టి తవ్వ అక్రమాలకు పాల్పడుతున్నా పట్టించుకునే వారు లేరని విమర్శించారు. ఇంటి స్థలమున్న వారు అర్జీ పెట్టుకుంటే 90 రోజుల్లోపు పట్టాను, ఇళ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. ఈరకంగా అనేక మంది పేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న వారు అర్జీలు పెట్టుకుంటే పట్టానూ ఇవ్వలేదు... ఇళ్లూ ఇవ్వలేదనని తెలిపారు. వీటన్నింటికీ పోరాటం ద్వారానే పరిష్కారం లభిస్తుందని చెప్పారు. గురువారం ఉదయం అనంతపురం జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, బి.శ్రీనివాసులు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామాంజినేయులు, కృష్ణమూర్తి, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# గతంలో కానుకలు..ఇప్పుడు కోతలు..

## నూతన సంవత్సర కానుకగా పింఛన్ల తొలగింపు : మాజీ మంత్రి పరిటాల సునీత



మాట్లాడుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత

**ప్రజాశక్తి-రామగిరి**

గత టిడిపి హయాంలో పండుగలు వస్తే కానుకలు ఇచ్చేవారమని, అదే వైసిపి ప్రభుత్వం వచ్చాక పండుగలకు సంక్షేమ పథకాల్లో కోతలు విధిస్తున్నారని మాజీమంత్రి పరిటాల సునీత విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పెన్షనర్లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 62లక్షల మందికిపైగా భూమి ఎక్కువ ఉందని, 3 వందల యూనిట్ల కన్నా ఎక్కువ కరెంటు వాడుతున్నారని నోటీసులు ఇచ్చారన్నారు. వారందరికీ పింఛన్లు తొలగిస్తారా.. అని ప్రశ్నించారు. అలాగే పింఛన్లు అందుకున్న కొందరు లబ్ధిదారుల పిల్లలు ఉద్యోగాలు చేస్తూ ట్యాక్స్లు కడుతుంటే వారికి కోతలు విధిస్తున్నారని.. అలాగే ఉపాధి కోసం లగేజీ వాహనాలు, కార్లు తెచ్చుకుంటే వాటిని కూడా కారణంగా చూపి పింఛన్లు, రేషన్కార్డులు తొలగిస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ గణాంకాల ప్రకారం సుమారు 2.10 లక్షల మంది పెన్షన్దారులకు నోటీసులు ఇచ్చి వివరణ అడిగారన్నారు. అయితే వాస్తవంగా బాధితుల సంఖ్య అంతకు నాలుగింతలు ఉన్నట్టు తెలుస్తోందన్నారు. ఒక్క రాప్తాడు నియోజకవర్గంలోనే 2,500 మందికిపైగా పెన్షన్లను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పెన్షన్ వస్తున్న ఏ ఒక్క పెన్షన్దారుకి అన్యాయం చేసినా ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. సిఎం జగన్ తన జన్మదినం పూర్తి చేసుకున్న మరుసటి రోజే పింఛన్లలో కోత విధిస్తూ పేదలతో కన్నీరు పెట్టించడం బాధాకరమన్నారు. జిల్లాలో ఉన్న కరవు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భూములు, వాహనాల విషయంలో టిడిపి హయాంలో చంద్రబాబు చాలా సడలింపులు ఇచ్చారన్నారు. ఇప్పుడు కూడా జిల్లాలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా అలాంటి సడలింపులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా పింఛన్లు, రేషన్ కార్డులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.



రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

## రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ధర్మవరం విద్యార్థులు

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగే వివిధ క్రీడల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల హెచ్ఎం శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు బేస్బాల్ అండర్-14 బాలుర విభాగంలో పార్థసారధి కాకినాడలో జరిగే పోటీల్లో, నెట్బాల్ అండర్-14 బాలుర విభాగంలో కార్తిక్నాయక్ నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగే పోటీల్లో, బాల్ బాడ్మింటన్ అండర్ -17 బాలుర విభాగంలో పవనకుమార్ మదనపల్లిలోజరిగే పోటీలలో, అండర్ -14 విభాగంలో చిరంజీవి, మహేష్, పొద్దుటూరులో జరిగే రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొంటారన్నారు. ఈమేరకు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్తులను పీడీలు నవీన్ కుమార్, నాగేంద్ర, ఉపాధ్యాయులు హేమలత, తులసీ, శంకరనారాయణ, శ్రీనివాసులు, ప్రసాద్బాబు, రామక్రిష్ణ, వి.శ్రీనివాసులు నాగరాజు, లీలావతి అభినందించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



## పంట కోత ప్రయోగాలు

**పరిగి :** మండల వ్యాప్తంగా ఖరీఫ్లో కంది పంట సాగు దిగుబడిపై రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. ఎర్రగుంట, హోన్నంపల్లి రైతు భరోసా కేంద్రాల పరిధిలోని శ్రీనివాసులు, బి వెంకటరమణప్ప, రామాంజినరెడ్డి పొలాల్లో పంట దిగుబడిని అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో ఏ. విజయభారతి, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనరసింహం, వ్యవసాయ విస్తరణ అధికారి అనిల్ కుమార్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు అనసూయ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## జాబ్కార్డుకు ఆధార్ అనుసంధానం

**లేపాక్షి :** ఉపాధి కూలీల జాబ్కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలని ఎపిడి శివానంద్నాయక్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో ఉపాధిహామీ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎపిడి మాట్లాడుతూ ఉపాధిహామీ కార్డుకు ఆధార్ అనుసంధానం రెండు రోజులలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒలు రషీద్, జ్యోతి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## డిపోలో సమస్యలు పరిష్కరించాలని వినతి

**మడకశిర :** మడకశిర ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంప్లాయిస్, నేషనల్ మజ్దూర్ యూనియన్ల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక డిపో మేనేజర్కు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మడకశిర డిపోలో గతంలో తిరుగుతున్న సర్వీసులను కొనసాగించాలన్నారు. స్థానిక అధికారులు ఏకపక్ష నిర్ణయాలతో డిపోను నష్టాలకు గురి చేస్తున్నారని విమర్శించారు. సమస్యలు పరిష్కరించకపోతే జెఎసి నిరవధిక ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, ముద్దప్ప, కరియన్న, తదితరులు పాల్గొన్నారు.

## క్షతగాత్రుడికి ఆర్థికసాయం

**తలుపుల :** మండల పరిధిలోని బట్రేపల్లి రేణుమాని మిట్ట సమీపంలో నాలుగు రోజుల క్రితం ట్రాక్టర్ బోల్తా పడి గంజి వారి పల్లికి చెందిన బాబావలి తీవ్ర గాయాలపాలై కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పి వి సిద్దారెడ్డి క్షతగాత్రుడిని బుధవారం పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించడంతో బాధిత కుటుంబ సభ్యులకు స్థానిక ఎంపీపీ మహమ్మద్ రఫీ నాయక్, గుణరంజన్ రెడ్డి ద్వారా రూ. 50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పురుషోత్తం రెడ్డి, ఫయాజ్ అష్రఫ్, మధుసూదన్ రెడ్డి, రంగారెడ్డి, చింతమిరెడ్డి గోపాల్ రెడ్డి, మౌలా, ఫక్రుద్దీన్, ముస్సిన్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం

**కదిరి టౌన్ :** సమాజ పురోగతిలో వికలాంగులు కీలక పాత్ర పోషిస్తున్నారని పట్టణ సిఐ తమ్మిశెట్టి మధు అన్నారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో బుధవారం స్థానిక వికలాంగుల భవనంలో జరిగిన సదస్సుకు సిఐ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవయవ లోపంతో జన్మించిన వ్యక్తులు అనేకమంది సమాజ పురోగతిలో గొప్ప పాత్ర నిర్వహించారన్నారు. మానసికంగా ఆధైర్య పడకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక గౌరవాధ్యక్షులు జి.ఎల్ నరసింహులు, సిఐటియు నాయకులు జగన్మోహన్, ముస్తాక్, ఫైరోజ్, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక కదిరి డివిజన్ అధ్యక్షులు వెంకటరమణ, కార్యదర్శి జయలక్ష్మి, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, హరి, కుల్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ వినియోగదారులకు అవగాహన

**గోరంట్ల :** మండలంలోని గుమ్మయ్య గారి పల్లి లో హరీష్ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో గ్యాస్ వినియోగదారులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు ఈ సందర్భంగా ఏజెన్సీ సిబ్బంది బాలు, మధు మాట్లాడుతూ సింగల్ సిలిండర్ ఉన్నవాళ్లకి డబల్ సిలిండర్ ఇస్తున్నట్లు చెప్పారు. కొత్తగా ఫైబర్ సిలిండర్ అందుబాటులో ఉందన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

## ఘనంగా సుబ్రమణ్యస్వామి షష్టి

**చిలమత్తూరు :** తొలి షష్టి సందర్భంగా మండల పరిధిలోని చేపెల్లి గ్రామంలో ప్రతి ఏటా నిర్వహించే సుబ్రహ్మణ్యస్వామి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గంలోని పలువురు ప్రజా ప్రతినిధులు,వైసిపి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కర్నాటక ప్రాంత వాసులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్ను ఉపయోగంలోకి తీసుకురండి

**బుక్కపట్నం :** స్థానిక ఆర్టీసీ బస్టాండ్ను ఉపయోగంలోకి తీసుకురావాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సామకోటి ఆదినారాయణ కోరారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఈ బస్టాండ్ నుంచి సదరు ప్రాంతాలకు బస్సులు రాకపోకలు కొనసాగేవని చెప్పారు. గతంలో నిత్యం ప్రయాణికులతో కళకళలాడుతున్న బస్టాండు నేడు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్టీసీ బస్టాండ్ను ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు.

## వాహనాల వేలం

**పుట్టపర్తి అర్బన్ :** వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలను రూరల్ పోలీస్ స్టేషన్ లో బుధవారం వేలం వేశారు. సెబ్ సిఐ మాధవీలత ఆధ్వర్యంలో ఈ వేలం పాటలు నిర్వహించినట్లు ఎస్ఐ బాజ్జాన్ తెలిపారు. మొత్తం ఎనిమిది వాహనాలలో ఐదు ద్విచక్ర వాహనాలు ఒక కారు వేలం పాటలో వినియోగదారులు దక్కించుకున్నారన్నారు.

## అనాథ కుటుంబానికి చేయూత

**పరిగి :** మండలంలోని బొర్రెడ్డిపల్లికి చెందిన తులసమ్మ అనే మహిళ భర్త చక్రినాయక్ అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబం అనాథగా మారింది. ఆ కుటుంబం దుస్థితిని స్థానిక వైసీపీ నాయకులు నరసింహారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పరిగి వేణుగోపాలస్వామి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన బాధిత కుటుంబ పోషణ కోసం తన ట్రస్ట్ మేనేజర్ శివకుమార్ ద్వారా మృతుని కుమార్తెకు [illegible] రూపాయలు ఆర్థిక సాయం అందించారు. దీంతో బాధితులు దివ్య ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పరిగి వేణుగోపాలస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు వ్యాపారులతో ఆర్టీసీ ఆర్ఎం సమావేశం

**కదిరి టౌన్ :** కదిరి డిపో కార్యాలయంలో గురువారం ఆర్టీసీ ఆర్ఎం అధ్యక్షతన వ్యాపారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ లో ఆవరణంలో స్థలాలు అద్దెకు ఇచ్చే విషయంపై గురువారం సాయంత్రం 4 గంటలకు డిపో మేనేజరు కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు కదిరి డిపో మేనేజరు బి.మైనొద్దీన్ తెలిపారు.

## అభివృద్ధికి సహకరించండి

**పెనుకొండ :** రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి సహకరించాలని నగర పంచాయతీ చైర్మన్ ఉమర్ ఫారుక్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు తయూబ్, సద్దాం తదితరులతో మాట్లాడారు. బాబయ్య స్వామి దర్గా పై రాజకీయాలు వదలి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యువగళం పోస్టర్లు విడుదల

**మడకశిర :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను టిడిపి నాయకులు బుధవారం విడుదల చేశారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు మనోహర్, కౌన్సిలర్లు ఉమాశంకర్, హనుమంతు, నాయకులు రామాంజనేయులు, గోవిందప్ప, ఓబన్న తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

# సమస్యలు సృష్టించి సహకరించమంటే ఎలా..?

## వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రశ్నించిన ఉపాధ్యాయులు



ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రశ్నిస్తున్న ఉపాధ్యాయులు

**ప్రజాశక్తి మడకశిర**

సజావుగా సాగిపోతున్న ఉపాధ్యాయుల జీవితాల్లో చిచ్చు రేపి ఏ మోహం పెట్టుకుని సానుకూలంగా స్పందించి సహకరించమని అడుగుతున్నారని వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని ఉపాధ్యాయులు నిలదీశారు. బుధవారం మడకశిర పట్టణంలోని యాదవ కళ్యాణమండపంలో జిల్లా సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మడకశిర నియోజకవర్గంలోని ఉపాధ్యాయులకు విలువలతో కూడిన బోధన అనే అంశంపై రెండు రోజులపాటు శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులను కలిసి తనకు ఓట్లు వేసి గెలిపించడంలో సహకరించాలని అభ్యర్థించారు. దీంతో ఉపాధ్యాయులు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. రవీంద్రారెడ్డిని ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. సిపిఎస్ రద్దు విధానం అమలు చేయకపోవడంతో పాటు వివిధ యాప్లను అమలు చేస్తూ తమను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని ఇలాంటి నేపథ్యంలో తాము ఎన్నికలకు ఎలా సహకరిస్తామని ప్రశ్నించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు రవీంద్రారెడ్డిని నిలదీశారు. దీంతో ఆయన ఉపాధ్యాయులను పక్కకు తీసుకువెళ్లి చర్చించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవి శేఖర రెడ్డి, రంగే గౌడు, వాగేష్, తదితరులు పాల్గొన్నారు.

# చెరువులో పడి వ్యక్తి మృతి

**పుట్టపర్తి అర్బన్ :** మండల పరిధిలోని అమగొండపాలెంకు చెందిన చిన్న వెంకటరాముడు మద్యం మత్తులో చెరువులో పడి మృతిచెందాడు. రూరల్ ఎస్ఐ బాజ్జాన్ తెలిపిన వివరాలు... చిన్న వెంకటరాముడు బుధవారం బుక్కపట్నం వెళ్లి మద్యం తాగాడు. గ్రామానికి చేరుకున్న అతను మత్తులో సమీపంలో గల చెరువులో ఈత కొట్టడానికి వెళ్లి చెరువులోకి దూకాడు. మత్తులో దిక్కు తెలియక అందులో మునిగిపోయాడు. మృతునికి భార్య ఉన్నప్పటికీ ఆమె అతన్ని వదిలేసిందని గ్రామస్తులు తెలిపినట్లు ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## పేకాట జూదరులు అరెస్టు

**రొద్దం. :** పెనుకొండ సి ఐ పర్యవేక్షణలో ఎస్ ఐ నాగస్వామి, సిబ్బంది బుధవారం పేకాట జూదరులను అరెస్టు చేశారు. పక్కా సమాచారం అందుకొన్న పోలీసులు ప్రణాళిక ప్రకారంగా బొక్కసాం పల్లిలో జూదరులను అరెస్టు చేసినట్లు చెప్పారు. 15 మంది గ్యాంబ్లింగ్ అడుతుండగా వారిపై రైడ్ చేసి వారి వద్దనుంది 1,64,940 రూపాయలు మరియు 7 ద్విచక్ర వాహనాలు మాత్రమేనని అనాన్రు. అధికారులు విచారణ చేసి కేసునమోదు చేసినట్లు అయన తెలపారు. ఈ కార్యక్రమం లో పోలీసులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో విఆర్ఎ మృతి

**తలుపుల :** మండలంలోని ఓదులపల్లి గ్రామ రెవెన్యూ సహాయకుడు పల్లె శ్రీరాములు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆర్ఐ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది బుధవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి అంతిమ సంస్కారాల నిమిత్తం 10 వేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి పరామర్శ

**బుక్కపట్నం :** ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన మండలంలోని చంద్రాయునిపల్లికి చెందిన వైసీపీ కార్యకర్త మానేని కృష్ణయ్య కుటుంబాన్ని వైసిపి రాష్ట్ర పొలిటికల్ కమిటీ సభ్యులు సోమశేఖర్ రెడ్డి బుధవారం పరామర్శించారు. మృతుని కుటుంబ సభ్యులకు వైసిపి తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తక్షణ సాయం కింద పదివేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వెంకట రమణయ్య , ఎంపీటీసీ చెన్నుడు , ఉప సర్పంచి చెన్నప్ప , వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మాజీ సర్పంచి మృతి

**గాండ్లపెంట :** మండల పరిధిలోని సోమయాజులపల్లి పంచాయతీ మాజీ సర్పంచి ఎం. కేశవరెడ్డి (81) అనారోగ్యంతో మృతి చెందాడు. ఈసందర్భంగా ఆయన చేసిన సేవలను గ్రామస్తులు గుర్తుకు తెచ్చుకున్నారు.

# పెండింగ్ బిల్లులు చెల్లించాలి : సిఐటియు

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

కదిరి ఐసిడిఎస్ పడమర ప్రాజెక్టులో అంగన్వాడీలకు పెండింగ్లో ఉన్న వేతనాలు, బిల్లులు, సెంటర్ అద్దెలు చెల్లించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జిఎల్ నరసింహులు మాట్లాడుతూ 2019 సంవత్సరం నుండి అనేకమంది అంగన్వాడీ కార్యకర్తలకు వేతనాలు పెండింగ్లో ఉన్నాయన్నారు. సమస్యను విన్నవించినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్ లో ఉన్న వేతనాలు, బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నీసా, ప్రాజెక్ట్ నాయకురాలు రంగమ్మ, సువర్ణ, రామలక్ష్మి, సుజాత, లక్ష్మిదేవి, సిఐటియు నాయకులు జగన్మోహన్, ముస్తాక్, ఫైరోజ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న అంగన్వాడీలు, నాయకులు



మడకశిరలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి



తనకల్లు మండలంలో పోస్టర్లు ప్రదర్శిస్తున్న నాయకులు

# జిల్లా వ్యాప్తంగా 4485 పింఛన్లకు ఎసరు : టిడిపి

**మడకశిర :** సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 4485మంది వృద్ధుల, వికలాంగుల, వితంతువుల, ఒంటరి మహిళల పింఛన్ల తొలగింపునకు కుట్ర పన్నారని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి విమర్శించారు. బుధవారం మడకశిర నగర పంచాయతీ పరిధిలోని 19, 20 వార్డులలో చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన స్థానిక నాయకులతో కలసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించారు. ఒక్క అవకాశం అంటూ రాష్ట్ర ప్రజల నెత్తిన కూర్చొన్న జగన్రెడ్డి రాష్ట్రాభివృద్ధికి పాతాళంలోకి నెట్టేశారని విమర్శించారు. ఈ అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ అధ్యక్షులు భక్తర్, పట్టణ అధ్యక్షులు మనోహర్, కార్యదర్శి పుల్లయ్య చౌదరి, క్లస్టర్ ఇన్ఛార్జి నాగరాజు, కౌన్సిలర్ ఉమా శంకర్, 4వ వార్డు కౌన్సిలర్ హనుమంతు, మాజీ కౌన్సిలర్లు గోవిందప్ప, నాగరాజు, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు తిమ్మరాజు, గోవింద తదితరులతో పాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**తనకల్లు :** మండల పరిధిలోని ఈతోడు, రాక్కుంటపల్లి, బిల్లూరివాండ్లపల్లి గ్రామాలలో టిడిపి నాయకులు బుధవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల గురించి ప్రజలకు వివరించారు. వైసిపి హయాంలో రాష్ట్రానికి తీరని నష్టం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, సొంపాళ్యం నాగభూషణ, మల్లికార్జున, దామోదర్, ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

**తలుపుల :** మండలంలోని ఈదులకుంట్ల పల్లి, మంగి వాండ్లపల్లి, మడుగు తండాతో టిడిపి నాయకులు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ముబారక్, పరిశీలకుడు, బండారు మనోహర్ నాయుడు, పల్లపు రామాంజినేయులు, శ్రీనివాసులు తదతరులు పాల్గొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : ఎమ్మెల్యే

**కదిరి టౌన్ :** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు నాగభూషణ పేర్కొన్నారు. కదిరి పట్టణంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్లో వాలెంటీర్లకు, నూతన సచివాలయం కన్వీనర్లకు జరిగిన సంయుక్త సమావేశంలో ఎమ్మెల్యేతో పాటు కదిరి నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర జానపద సజనాత్మకత,కళల అకాడమీ చైర్మన్ కొండవీటి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వాలెంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, వివిధ శాఖల చైర్మన్లు, డైరెక్టర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

# రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

**ప్రజాశక్తి-హిందూపురం**

విద్యాభారతి రాష్ట్ర స్థాయి బేల్-కూద్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడి దేశానికి, రాష్ట్రానికి కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని పెనుకొండ డిఎస్పి హుస్సేన్ పీరా, విద్యాభారతి రాష్ట్ర అధ్యక్షులు గొల్లపల్లి నాగేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జెపికె రాములు కోరారు. హిందూపురంలోని సరస్వతి విద్యామందిరం విద్యారణ్య ఆంగ్లమాధ్యమ ఉన్నత పాఠశాలలో విద్యాభారతి రాష్ట్ర స్థాయి ఖేల్-కూద్ పోటీలు బుధవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభం కార్యక్రమానికి హాజరైన అతిథులు మాట్లాడుతూ విద్యాభారతి రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందిన వారు దేశ స్థాయి విద్యాభారతి క్రీడల్లో పాల్గొవచ్చున్నారు. మూడు రోజులు ఈ క్రీడలు కొనసాగుతాయని పాఠశాల ప్రధానాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగం సుధాకర్ రెడ్డి, కన్నా భాస్కర్, కెఎ. రాధాకృష్ణ, ఓంకార నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పార్థసారథి

# సమన్వయంతో పనిచేయండి : బికె

**ప్రజాశక్తి -పెనుకొండ**

పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బికె. పార్థసారథి పేర్కొన్నారు.బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ రియల్ టైం స్ట్రాటజీ (ఆర్ టి ఎస్ )కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ,ట్రైనర్ ముస్తఫా, పరిశీలకులు నరసింహ యాదవ్,మనోహర్ నాయుడు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల గురించి వివరించి ప్రజలను చైతన్యం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కురుబ కృష్ణమూర్తి, ఐటీడీపి జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు, జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు కేశవయ్య, మునిమడుగు వెంకటరాముడు, రొద్దం నరసింహులు, దేవా నరసింహప్ప, అశ్వర్థరెడ్డితో పాటు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తాం

## ఆర్టీసీ జోనల్ చైర్పర్సన్ మాల్యవంతం మంజుల

**ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్**

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని ఆర్టీసీ జోనల్ చైర్పర్సన్ మాల్యవంతం మంజుల పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె బుధవారం పుట్టపర్తి బస్టాండులో పుట్టపర్తి నుంచి కదిరికి రెండు బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాకు మరో 42 ప్రైవేట్ బాడుగ బస్సులకు గాను ఇప్పటికే 18 వచ్చాయని, మిగతా బస్సులు త్వరలోనే వస్తాయని అన్నారు. కాల పరిమితి దాటిన బస్సులను వినియోగించమన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సమయపాలన పాటించి ప్రయాణికులను క్షేమంగా గమ్యం చేర్చడమే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి మధుసూదన్, డిఎమ్ ఇనయతుల్లా, ఎస్టిఐ పెద్దన్న, యూనియన్ నాయకులు షబ్బీర్, ముత్యాలు, పార్థసారధి రెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్పర్సన్



ప్రతిభా విద్యార్థులతో మైనాస్వామి, తదితరులు


# లేపాక్షికి యునెస్కో గుర్తింపు ఇవ్వాలి

**ప్రజాశక్తి - హిందూపురం**

ప్రపంచ ప్రసిద్ధి గాంచిన లేపాక్షి వీరభద్రాలయ కట్టడాలు, శిల్పకళ, తైలవర్ణ చిత్రాలకు ప్రపంచ వారసత్వ కట్టడాల జాబితాలో యునెస్కో శాశ్వత గుర్తింపునకు అవసరమైన అన్ని అర్హతలు ఉన్నాయని చారిత్రక పరిశోధకుడు మైనాస్వామి అన్నారు. ఇటీవల లేపాక్షిలో జరిగిన జాతీయ స్థాయి సదస్సులో బాలాజీ కళాశాలకు చెందిన 40 మంది విద్యార్థులు పత్ర సమర్పణలు, పరిశోధక వ్యాసాలు సమర్పించారు. ఈ మేరకు బుధవారం కళాశాలలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలను మైనాస్వామి అందజేశారు. ఈ సందర్భంగా మైనాస్వామి, ప్రిన్సిపల్ వీరభద్రప్ప మాట్లాడుతు లేపాక్షి వీరభద్రాలయ సముదాయంలో ఇంజనీరింగ్ చాతుర్యం అమోఘమని ఆయన కొనియాడారు. లేపాక్షికి యునెస్కో గుర్తింపు లభిస్తే కేవలం లేపాక్షి మాత్రమే కాకుండా శ్రీ సత్య సాయి జిల్లాలోని పలు ప్రదేశాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ వీరభద్రప్పకు మైనా స్వామి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గోపాల్, తెలుగు అధ్యాపకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**హిందూపురం :** హిందూపురం పట్టణంతో పాటు రూరల్ మండల వ్యాప్తంగా పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే బాధ్యత బూత్ కన్వీనర్లు, సచివాలయ వాలెంటీర్లదేనని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్ కె ఫంక్షన్ హాల్ లో హిందూపురం రూరల్ మండలం, పట్టణ వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ నూతనంగా నియమించిన బూత్ కన్వీనర్లు, సచివాలయ వాలెంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఇక్బాల్ మాట్లాడుతూ కొన్ని కారణాల వల్ల ఈనెల పింఛనుదారుల్లో కొంతమందికి పరిశీలన నిమిత్తం నోటీసులు ఇచ్చామని అన్నారు. అయితే నియోజకవర్గ వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు రద్దు చేయకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబివుల్లా, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, రూరల్ కన్వీనర్ బసిరెడ్డి, కౌన్సిలర్లు జయ రాములు, మారుతీ రెడ్డి, సునీత వెంకటేష్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

# ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-హిందూపురం**

ప్రజల సంక్షేమం కోసం ప్రజాసమస్యలను అనునిత్యం వెలికితీస్తూ నిజాయితీగా, నిర్భయంగా వార్తలను ప్రచురించే సామర్థ్యం ప్రజాశక్తి దినపత్రికకు మాత్రమే ఉందని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్కె ఫంక్షన్ హాలులో ప్రజాశక్తి 2023 నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కార్పొరేట్ పత్రికలకు పోటీగా ప్రజాశక్తి పత్రిక నిలుస్తూ కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన బడుగు, బలహీన మైనార్టీ వర్గాల ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావటం అభినందనీయమన్నారు. ప్రజాశక్తి దినపత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.



క్యాలెండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ, చైర్పర్సన్, తదితరులు

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ ఇంద్రజ, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, వైస్ చైర్మన్ జబివుల్లా, వైసిపి సీనియర్ నాయకులు కొండూరు వేణుగోపాల్ రెడ్డి, కౌన్సిలర్లు జయరాములు, మారుతీరెడ్డి, గిరీష్, నాయకులు చాంద్బాషా, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కొల్లాపురమ్మ ఊరిదేవర


కొల్లాపురమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

**బెలుగుప్ప :** మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో మూడు రోజులుగా కొల్లాపురమ్మ ఊరిదేవర వైభవంగా జరుగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో కొల్లాపురమ్మ దేవతకు దున్నపోతును బలి ఇచ్చి మొక్కలు తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి తనయుడు ప్రణయ్‌రెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి తనయుడు భీమిరెడ్డి పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే స్థానికులు అమ్మవారికి పొట్టేళ్లను బలి ఇచ్చారు. ఊరిదేవరను పురస్కరించుకుని బంధువులు భారీగా తరలిరావడంతో నక్కలపల్లి గ్రామం కిటకిటలాడింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐలు రామకృష్ణయ్య, రామదాసు, జమేదారు బాలనరసింహులు, పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## నేడు రైతులతో గ్రామసభ

**బత్తలపల్లి :** అనంతపురం-కదిరి జాతీయ రహదారి విస్తరణలో బత్తలపల్లి-ముదిగుబ్బ రహదారిపై భూములు కొల్పోతున్న రైతులతో గురువారం గ్రామసభను ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ యుగేశ్వరీదేవి తెలిపారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ గురువారం ఉదయం 10.30 గంటలకు ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించే గ్రామసభకు రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం, 1బీ, అడంగల్, బ్యాంకు ఖాతా పాసుపుస్తకం తీసుకుని రావాలని కోరారు.

## 4న మండల సర్వసభ్య సమావేశం

**బత్తలపల్లి :** మండలంలోని ప్రజాసమస్యలపై చర్చించేందుకు మూడు నెలలకు ఒక్కసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం వచ్చే ఏడాది జనవరి 4న ఎంపిపి గుర్రం వనజ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ సాయిమనోహర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించనున్న సమావేశానికి మండల స్థాయి అధికారులందరూ తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. ఎవ్వరూ గైర్హాజరు కాకూడదన్నారు.

## 31లోగా ఇకెవైసి చేయించుకోండి

**బత్తలపల్లి :** పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 31వ తేదీలోపు ఇకెవైసి చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో సూచించారు. 13వ విడత పీఎం కిసాన్ ఆర్థికసాయం జమ కావాలంటే ఇకెవైసి తప్పనిసరి అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలో ఇంకా 1.674 మంది రైతులు ఇకెవైసి చేయించుకోలేదన్నారు. ఈనెల చివరలోపు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి ఇకెవైసి చేయించుకోవాలని కోరారు.

## నేడు సమావేశం

**బత్తలపల్లి :** బత్తలపల్లి, తాడిమర్రి మండలాలకు చెందిన సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లుతో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గురువారం సమావేశం ఏర్పాటు చేసినట్లు వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రెండు మండలాలకు చెందిన ఎంపిపిలు, జడ్పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు, మండల కన్వీనర్లు. సింగిల్‌విండో అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు తప్పక హాజరు కావాలని కోరారు.

# ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులను అరికట్టాలి

### టిడిపి వడ్డెర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్


విలేఖరులతో మాట్లాడుతున్న టిడిపి వడ్డెర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్, నాయకులు

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

వైసిపి అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులు అధికమయ్యాయని టిడిపి వడ్డే సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్, టిడిపి బీసీ సెల్ జిల్లా అధ్యకుడు రంగయ్య అన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అగ్రవర్ణాలకు చెందిన అధికార పార్టీ నాయకులు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా ధర్మవరం నియోజకవర్గంలో బీసీలను అణగదొక్కాలనే ఉద్దేశంతో దాడులు చేయడంతోపాటు వారిని తీవ్రంగా గాయపరుస్తున్నారన్నారు. అంతటితో ఆగకుండా దెబ్బలు తిన్నవారిపైనే పోలీసు కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. గతంలో కూడా ధర్మవరం మండలంలో బోయ కులానికి చెందిన వారిని దారుణంగా హత్య చేశారని గుర్తు చేశారు. అలాగే కుణుతూరులో టిడిపి కార్యకర్త వడ్డే ఆదినారాయణను అదేగ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు దారుణంగా దాడి చేసి గాయపరిచారన్నారు. తిరిగి పోలీసులు ఆదినారాయణపై 307 కేసు కట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి బీసీలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కురుబ సాధికారసమితి జిల్లా అధ్యక్షుడు రమణ, వడ్డెర సాధికార సమితి జిల్లా అధ్యకుడు పల్లపు రవీంద్ర, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిది వడ్డే నాగేంద్ర, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యకులు కేశళ్ల శ్రీనివాసులు, టిడిపి రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి సాహెబ్బీ, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్ నాయక్, కురుబ సాధికార రాష్ట్ర కార్యదర్శి నీల్లపాల రాజగోపాల్, కురుబ రాష్ట్ర డైరెక్టర్ రాగేమురళి, బీసీ సెల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బీరన్న, టిడిపి సీనియర్ నాయకుడు ఫణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌ఎస్‌ఎ కార్యాలయం ముట్టడి

### పిడిఎస్‌యు నాయకుల అరెస్ట్.. విడుదల



ఆందోళన చేస్తున్న పిడిఎస్‌యు నాయకులు

**అనంతపురం కలెక్టరేట్ :** జిల్లాలోని కెజిబివి పాఠశాలల్లో ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న ఘటనలకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని, దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఎస్‌ఎస్‌ఏ కార్యాలయాన్ని ముట్టడించారు. నాయకులు, కార్యకర్తలు బైటాయించి ఆందోళన నిర్వహించారు. అధికారులు బయటకు వచ్చి సమాధానం చెప్పాలంటూ కార్యాలయం లోపలికి వెళ్లడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అడ్డుకుని బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వీరేంద్ర ప్రసాద్, నగర అధ్యక్షులు బండారు శంకర్, ఐసా జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఆలాం, ఎస్సీ, ఎస్టీ జేఏసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి, మాల మహానాడు నగర అధ్యక్షుడు జొల్లు ఓబుల్‌రాజు, ఆర్‌సిసి రాష్ట్ర అధ్యక్షులు శివానంద, విద్యావంతుల ఐక్య వేదిక అధ్యక్షులు వెంకటేష్, అనంత హక్కుల పోరాట సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సోమర రాహుల్, సీ విద్యార్థి కో కన్వీనర్ రంగవల్లి తదితరులు పాల్గొన్నారు.

## నేడు కౌన్సిల్ సమావేశం

**ధర్మవరం టౌన్ :** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఉదయం 11గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్టు మున్సిపల్ ఛైర్‌పర్సన్ లింగం నిర్మల, కమిషనర్ మల్లికార్జున బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

## డ్రోన్‌తో పంటలకు మందులు పిచికారీ

**రొద్దం :** డ్రోన్‌తో పంటలకు మందు పిచికారీ చేయడం ఎంతో సులభమని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. మండలంలోని పెద్దగువ్వలపల్లిలో జెట్టి మారుతిరెడ్డి సాగు చేసిన శనగ పంటకు డ్రోన్ ద్వారా క్రిమిసంహారక మందు పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి చంద్రశేఖర్‌తో పాటు రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం జెడి మల్లీశ్వరి, అగ్రికల్చర్ ఎడి సుబ్బారావు, జిల్లా వనరుల కేంద్రం సనావుల్లా, సహాయ వ్యవసాయ సంచాలకులు, స్వయం ప్రభ తహశీల్దార్ అనంత చారి, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

## ట్యాబ్‌ల పంపిణీ

**కొత్తచెరువు :** మండల పరిధిలోని చనరాశిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మటన్ శంకర్, నంజీ రెడ్డి, రామచంద్ర, స్కూల్ కమిటీ చైర్మన్ తిమ్మారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఓబుల దేవర చెరువు :** మండల పరిధిలోనీ గౌని పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 56 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దామోదర్ రెడ్డి, ఎంపీటీసీ కేశవప్ప , అల్లాపల్లి సర్పంచి వెంకటరమణ, హెచ్‌ఎం విజయలక్ష్మి, నాయకులు ఆనంద్ రెడ్డి, రత్న శేఖర్ రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి పాఠశాల కమిటీ చైర్మన్ కేశప్ప పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ప్రజాశక్తి-గోరంట్ల**

ప్రజాసంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే శంకరనారాయణ అన్నారు. మండలంలో పులేరు గ్రామంలో బుధవారం నిర్వహించిన గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న పథకాల అమలుతీరు గురించి అడిగితెలుసుకోవ్లాన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. నవరత్నాలను ప్రతి లబ్ధిదారునికి చేరే విధంగా చేస్తున్నారని ఎమ్మెల్యే శంకర్ నారాయణ తెలిపారు మొదట పులేరు గ్రామ సర్పంచి ప్రభాకర్ రావు ఎమ్మెల్యే శంకర్ నారాయణను పూలమాలతో సత్కరించారుఏ. ఈ కార్యక్రమంలో కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సర్పంచి ప్రభాకర్ రావు ఉపసర్పంచ్ శ్రీనివాసులు మండల అధ్యక్షురాలు ప్రమీల మూర్తి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ శంకర్ రెడ్డి, తహశీల్దార్ రంగనాయకులు ఎంపీడీవో రఘునాథ్ గుప్తా, సర్పంచులు, ఎంపీటీసీలు, వాలెంటీర్లు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు

## మండల సమాఖ్య నిర్వహణపై అవగాహన

**ఓబుల దేవర చెరువు :** మండల సమాఖ్య ఆర్థిక నిర్వహణపై స్థానిక పల్లవి మండల సమాఖ్య కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. క్లస్టర్ పరిధిలోని పది మండలాల సభ్యులు, అకౌంటెంట్లు, ఎపిఎంలకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీడీ నరసయ్య, క్లస్టర్ పరిధిలోని మహిళా సమాఖ్యల సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఫ్రెషర్స్ డే

**బుక్కపట్నం :** మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువులతోపాటు, క్రీడలలో కూడా రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది సుందర్ మోహన్ రెడ్డి, దస్తగిరి, ఆదినారాయణ , ఓబయ్య, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## జనన ధ్రువీకరణ పత్రాలు జారీ

**రాయదుర్గం :** గుమ్మగట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పులు జరిగి ఇప్పటివరకు పిల్లల జనన ధ్రువీకరణ పత్రాలు పొందని వారు డిసెంబర్ నెలాఖరులోగా ఆన్‌లైన్ పత్రాలను పొందవచ్చని గుమ్మగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రజారోగ్య శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు 2016 సంవత్సరం నుంచి ఇప్పటివరకు తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పులు జరిగి సర్టిఫికెట్లు పొందని తల్లిదండ్రులు తమ ఆధార్, సర్టిఫికెట్లను చూపి ఆన్‌లైన్ ధ్రువీకరణ పత్రాలు పొందాలని కోరారు.

## క్రీడలు ప్రారంభం

**రాయదుర్గం :** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను ఎస్ఐ సుమన్, ఎంఇఒ నాగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు అంజి, రాజు, కుమార్, కొట్రేష్ మాట్లాడుతూ విద్యార్థులోని క్రీడా ప్రతిభను వెలికి తీసుకొచ్చేందుకు తాము ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలను ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు పర్యవేక్షించారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్ఐ సుమన్